సాక్షి రంగారెడ్డి

బుధవారం । 24 । జూలై । 2024



అవే వెతలు

చేవెళ్ల గ్రామ ప్రధాన రోడ్డుకు శంకుస్థాపన చేసి ఏడాది గడుస్తున్నా అడుగు ముందుకు కదలడం లేదు.

16లో▸

రేపు పెద్దఅంబర్‌పేట మున్సిపల్ కమిషనర్‌తో ఫోన్ ఇన్

పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, ప్రజల ఇబ్బందులు తదితర విషయాలపై ప్రజలకు ఫోన్ ఇన్ ద్వారా కమిషనర్ సలహాలు, సూచనలు ఇస్తారు.





అంశం : పారిశుద్ధ్యం, పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు

మున్సిపాలిటీ : పెద్దఅంబర్‌పేట

కమిషనర్ : ఎస్. రవీందర్‌రెడ్డి

తేదీ : 25-7-2024 (గురువారం)

సమయం : ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్:
90304 13639

సత్వరమే పరిష్కారం



సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తాం

- పారిశుద్ధ్యం మెరుగుకు ప్రత్యేక కార్యాచరణ
- మున్సిపాలిటీని కాలుష్యరహితంగా తీర్చిదిద్దుతాం
- ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తాం
- ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్
- 'సాక్షి' ఫోన్ ఇన్‌కు విశేష స్పందన

'ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తాం.. పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చేందుకు, ఆయా వార్డులను పరిశుభ్రంగా ఉంచేందుకు ఎప్పటికప్పుడు చర్యలు చేపడతాం.. కాలుష్య రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తాం.. పాలకవర్గ సహకారంతో మున్సిపాలిటీని అభివృద్ధి చేసేందుకు అహర్నిషలు కృషి చేస్తాం..' అని ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్ అన్నారు. 'సాక్షి' ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించిన 'ఫోన్‌ఇన్' కార్యక్రమానికి మంచి స్పందన లభించింది. ఆయా వార్డుల నుంచి పలువురు ఫోన్ చేసి సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. వార్డు ఆఫీసర్లతో కలిసి కమిషనర్ వాటిని నోట్ చేసుకున్నారు. రెండుమూడు రోజుల్లో వాటిని పరిష్కరిస్తామని ఆయన వెల్లడించారు.

– ఇబ్రహీంపట్నం



వార్డు ఆఫీసర్లతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్న ఇబ్రహీంపట్నం కమిషనర్ రవీంద్రసాగర్

ఇబ్రహీంపట్నానికి తలమానికంగా ఉన్న చెరువులోకి డ్రైనేజీ నీరు వచ్చి చేరుతుండదంతో పూర్తిగా కాలుష్యంగా మారింది. చేపలను సైతం ఎవరూ కొనడం లేదు. మటన్, చికెన్ దుకాణాల వ్యర్థాలు, చెత్తచెదారాన్ని డంప్ చేస్తుండటంతో చిన్న చెరువు కట్ట దుర్గంధభరితంగా మారింది.

– ఎన్ను గోవర్ధన్‌రెడ్డి, 13వ వార్డు

కమిషనర్: మురికి నీటి శుద్ధి ప్లాంటును (ఎస్‌టీపీ) ఏర్పాటు చేస్తాం. డ్రైనేజీ నీరు చెరువులోకి రాకుండా చర్యలు తీసుకుంటాం. చికెన్, మటన్ వ్యాపారులకు వ్యర్థాల పారబోతపై నోటీసులిచ్చాం. చెత్తచెదారం వేయకుండా 9 ఫీట్ల ఎత్తులో ఐరన్ షీట్‌ను ఏర్పాటు చేస్తాం.

ఊడ్చిన చెత్తను ఎక్కడపడితే అక్కడ కుప్పలుగా పెడుతున్నారు. నిర్వహణ సరిగా లేదు. కుక్కల బెడద తీవ్రంగా ఉంది.

– పసునూరి వినోద్‌కుమార్, 13వ వార్డు

కమిషనర్: మున్సిపాలిటీ విస్తీర్ణం పెద్దగా ఉంది. శానిటరీ వర్కర్స్ సరిపోవడం లేదు. కొత్త సిబ్బంది రావాలంటే మున్సిపల్ ఆదాయం పెరగాల్సి ఉంది. చెత్తకుప్పలు పెట్టకుండా చర్యలు తీసుకుంటాం. పారిశుద్ధ్యం మెరుగుకు ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నాం.

కుక్కల బెడద తీవ్రంగా ఉంది.

– శ్రీలత, సయ్యద్ మోబిన్, మంగ, ప్రదీప్‌కుమార్

కమిషనర్: బ్లూ క్రాస్ దృష్టికి తీసుకెళ్లాం. వేరే చోటికి తరలించి స్టెరిలైజేషన్ చేయించి, యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయిస్తాం.

కూల్చివేసిన పాత విజయటాకీస్ ఖాళీస్థలంలో పిచ్చిమొక్కలు, గడ్డి పెరిగాయి. పాములు వస్తున్నాయి, దోమలతో ఇబ్బంది పడుతున్నాం.

– మంఖాల అశోక్, యాదయ్య

కమిషనర్: చెత్తచెదారాన్ని తొలగించి శుభ్రం చేయిస్తాం.

ఖానాపూర్‌లోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చెత్తచెదారంతోపాటు మురికినీరు వచ్చిచేరి ప్రమాదాలకు కారణం అవుతోంది. నీళ్లు నిలవకుండా చర్యలు తీసుకోవాలి.

– శ్రీరమ్య, 10వ వార్డు

కమిషనర్: ట్రాన్స్‌ఫార్మర్ వద్ద నీళ్లు నిలవకుండా ఒకటిరెండు రోజుల్లో చర్యలు తీసుకుంటాం.

ఖాళీ ప్లాట్లు, కూలిపోతున్న.. పాడుబడిన ఇళ్లలోని ఖాళీ స్థలాల్లో పిచ్చి చెట్లు, చెత్తచెదారం పేరుకుపోయి వర్షాలకు పాములు, దోమల బెడద తీవ్రమైంది.

– సుధాకర్, సి.గణేశ్, యాదయ్య, వంశీకృష్ణ

కమిషనర్: ఇళ్లు, ఖాళీ ప్లాట్ల యజమానులకు నోటీసులిస్తాం. వాళ్లు చెత్తచెదారం తొలగించకుంటే మున్సిపల్ సిబ్బందితో తొలగిస్తాం. ఆయా యాజమానుల నుంచి అందుకు సంబంధించిన రుసుం వసూలు చేస్తాం.

అంజనేయగుడి వెనుక నుంచి మురుగునీరు పారి పంట పొలాల్లోకి వస్తోంది.

– రంజిత్‌రెడ్డి, ఖానాపూర్

కమిషనర్: కౌన్సిల్‌లో మాట్లాడి మురుగునీరు అక్కడి నుంచి పారకుండా చర్యలు తీసుకుంటాం.

సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. ప్రభుత్వాస్పత్రిలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండటం లేదు. ఆస్పత్రి అపరిశుభ్రంగా ఉంది.

– తాళ్ల మహేశ్‌గౌడ్, శ్రీరాంనగర్ కాలనీ

కమిషనర్: కలెక్టర్ ఇటీవల ఆస్పత్రిని విజిట్ చేసి సమస్యలను తెలుసుకున్నారు. త్వరలో పరిష్కారం అవుతాయి.

మ్యాన్‌హోల్స్‌కు కవర్స్ లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం.

– హరిదాసు, 22వ వార్డు

కమిషనర్: వెంటనే కవర్స్ బిగించే ఏర్పాటు చేస్తాం.

అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు ఆగిపోయాయి. వెంటనే పూర్తి చేయాలి.

– విద్యాసాగర్, 4వ వార్డు

కమిషనర్: డ్రైనేజీ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూస్తాం.

దోమల నివారణకు చర్యలు తీసుకోవడం లేదు.

– ప్రవీణ్‌కుమార్, 8వ వార్డు

కమిషనర్: వార్డుల వారీగా ఫాగింగ్ చేయిస్తున్నాం. నిల్వ ఉన్న నీటి గుంతల్లో యాంటీ లార్వా స్ప్రే చేస్తున్నాం. దోమలు వృద్ధి చెందకుండా అన్నివిధాలా చర్యలు చేపడుతున్నాం.

మంచినీళ్లు సరిగా రావడంలేదు. ఇబ్బందులు పడుతున్నాం.

– పొగాకు మల్లప్ప, విజయ, జమీర్, రాజు

కమిషనర్: కృష్ణ జాలాలు అబ్దుల్లాపూర్‌మెట్‌కు వెళ్లే వాటర్ పైపులైన్ ద్వారానే ఇబ్రహీంపట్నంకు పంపిణీ అవుతున్నాయి. ప్రత్యేక పైపులైన్ వేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ప్రతి ఒక్కరికీ 135 లీటర్ల చొప్పున రోజు విడిచి రోజు పంపిణీ చేస్తున్నాం. నీళ్లు రాకుంటే సిబ్బంది వచ్చి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం.

మురికినీరంత బాగ్యనగర్‌కాలనీలోకి చెరుతోంది. ఇళ్లలో ఉండలేని పరిస్థితి.

– మల్లేష్, ప్రభాకర్

కమిషనర్: సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ కోసం ప్రతిపాదనలు పంపాం. ఇంజనీరింగ్ విభాగం కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తోంది. త్వరలో సమస్య పరిష్కారం అవుతుంది.

బడ్జెట్‌పై ఎవరేమన్నారంటే..



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ లోక్‌సభలో మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అన్ని రంగాలకు ప్రాధాన్యత కల్పించిందని.. నిధులు కేటాయించిందని.. బడ్జెట్ భేషుగ్గా ఉందని బీజేపీ నేతలు అంటుండగా.. తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందని.. వివక్ష ప్రదర్శించారని.. ఈ బడ్జెట్ తీవ్ర నిరాశపర్చిందని కాంగ్రెస్ నాయకులు విమర్శిస్తున్నారు.

అన్ని రంగాలకు న్యాయం



చేవెళ్ల: అన్ని రంగాలకు సముచిత న్యాయం చేసేలా కేంద్ర బడ్జెట్ ఉంది. దేశం మొత్తం అభివృద్ధి జరిగేలా కేటాయింపులు ఉన్నాయి. యువత, మహిళలు, విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, వ్యవసాయం, పేదలు ఇలా అన్నింటికీ అవకాశాలు కల్పించింది. ఈ బడ్జెట్‌ను చూసి ప్రతిక్షాలకు మాట్లాడే అవకాశం లేకుండా పోయింది. అందుకే అవగాహన లేకుండా విమర్శలు చేస్తున్నారు.

– కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎంపీ, చేవెళ్ల

బడ్జెట్.. సూపర్



సాక్షి రంగారెడ్డి జిల్లా: నిరుపేదల సంక్షేమం, దేశాభివృద్ధి కోసం కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్ చాలా బాగుంది. పీఎం ఆవాస్ యోజన కింద అదనంగా ఇళ్ల నిర్మాణం.. మహిళలు, బాలికలు, గిరిజనుల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించింది. ప్రధాని, ఆర్థికమంత్రికి కృతజ్ఞతలు.

– బొక్క నర్సింహారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

తెలంగాణపై సవతి తల్లి ప్రేమ



మీర్‌పేట: బడ్జెట్ కేటాయింపులో కేంద్రం తెలంగాణపై సవతి తల్లి ప్రేమ చూపించింది. ఆశించిన స్థాయిలో నిధులు కేటాయించలేదు. ఏపీపై ఉన్న ఆసక్తి తెలంగాణపై లేదు. రైల్వే లైన్లు, రహదారుల విస్తరణ, పాలమూరు ఎత్తిపోతల పథకం ప్రాజెక్టును విస్మరించింది. ఐటీఐఆర్ ప్రాజెక్ట్, శాటిలైట్ సిటీల ఏర్పాటును పట్టించుకోలేదు.

– చల్లా నర్సింహారెడ్డి, టీయూఎఫ్‌ఐడీసీ చైర్మన్, డీసీసీ అధ్యక్షుడు

పంద్రాగస్టులోపు ధరణి సమస్యలు పరిష్కరించాలి

కలెక్టర్ శశాంక

ఇబ్రహీంపట్నం రూరల్: పంద్రాగస్టులోపు పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను పరిష్కరించాలని కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం ఆర్డీఓలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ధరణి దరఖాస్తుల పరిష్కారానికి వివిధ మాడ్యూల్స్ కింద దాఖలైన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని సూచించారు. రోజు వారీగా లక్ష్యాన్ని నిర్ణయించుకొని ఆగస్టు 15 లోపు పూర్తి స్థాయిలో క్లియర్ చేయాలన్నారు. కందుకూరు, యాచారం, చేవెళ్ల, మొయినాబాద్, మంచాల, మహేశ్వరం మండలాల్లో ఎక్కువగా పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని సత్వరమే పరిష్కరించాలని సంబంధిత మండలాల అధికారులను ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ భూపాల్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి, చేవెళ్ల ఆర్డీఓ సాయిరామ్, రాజేంద్రనగర్ ఆర్డీఓ వెంకట్ రెడ్డి, వివిధ మండలాల తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

ఉద్యాన పంటలతో మంచి ఆదాయం

ఉద్యాన, పట్టు పరిశ్రమ జిల్లా అధికారి నీరజాగాంధీ



కూరగాయల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న నీరజాగాంధీ

యాచారం: ఉద్యాన పంటల సాగుతో స్వల్ప కాలంలో మంచి ఆదాయం గడించే అవకాశం ఉందని ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ జిల్లా అధికారిణి నీరజాగాంధీ పేర్కొన్నారు. మండల పరిధిలోని చౌదర్‌పల్లి గ్రామంలో మంగళవారం ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో కూరగాయల పంటలు, ఆయిల్‌పాం, పట్టు పురుగుల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వ్యవసాయ పొలాలున్న రైతులు ఉద్యాన, పట్టు పురుగుల పెంపకం చేపట్టాలని సూచించారు. రైతులకు సకాలంలో సూచనలు, సలహాలు అందించడానికి ఆయా శాఖల అధికారులు సిద్ధంగా ఉంటారన్నారు. వర్షాకాలంలో కూరగాయల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, అధికారులు శ్రీ కృష్ణ, సంజయ్‌కుమార్, కనకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

రుణమాఫీపై ఆందోళన వద్దు

జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి



రైతు నేస్తం కార్యక్రమాన్ని వీక్షిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి

మొయినాబాద్: రుణమాఫీపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి అన్నారు. మొయినాబాద్ రైతు వేదికలో మంగళవారం జరిగిన రైతు నేస్తం కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రూ.లక్ష లోపు రుణం ఉన్నవారికి మాఫీ జరిగిందని చెప్పారు. ఆధార్ లింకు సరిగా లేకపోవడం, రూ.లక్షలోపు రుణం తీసుకుంటే వడ్డీతో కలిపి రూ.లక్షకు మించడంతో కొంత మందికి మాఫీ కాలేదని తెలిపారు. ఆ సమస్యలన్నీ పరిష్కారమైతే అందరికీ రుణమాఫీ వస్తుందన్నారు. ఇందులో ఎలాంటి సందేహాలున్నా ఏఈఓ, ఏఓలను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రాగమ్మ, ఏఈఓలు సునీల్, కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ అయిన రైతులతో భేటీ

షాబాద్: రుణమాఫీపై రైతులు సంతోషం వ్యక్తం చేసినట్లు జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని తాళ్లపల్లి, తిమ్మారెడ్డిగూడ, ముద్దెంగూడ గ్రామాల్లో మంగళవారం రుణమాఫీ అయిన రైతులను కలిసి మాట్లాడారు. అనంతరం నాగర్‌గూడ ఎస్‌బీఐని సందర్శించారు. రుణమాఫీ అయిన రైతుల క్రాప్ లోన్ రెన్యూవల్ గురించి బ్యాంకు మేనేజర్‌తో చర్చించారు. ఆమె వెంట మండల వ్యవసాయశాఖ అధికారి వెంకటేశం, ఏఈఓలు రాజేశ్వరి, గీత, మాజీ ఎంపీటీసీ పాండు, ఆయా గ్రామాల రైతులు ఉన్నారు.

అవకాడో పంటను పరిశీలించిన మాజీ మంత్రి



మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డికి అవకాడో మొక్కను అందిస్తున్న రైతు జైపాల్‌నాయక్

కందుకూరు: మండల పరిధిలోని దెబ్బడగూడలో రైతు జైపాల్‌నాయక్ పండిస్తున్న అవకాడో పంటను మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. పంట సాగు చేసిన విధానం, దిగుబడి తదితర వివరాలను రైతును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతు ఆయనకు అవకాడో పండ్లు, మొక్కలను అందజేశారు.

శాకంబరీదేవిగా బల్కంపేట ఎల్లమ్మ

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ దేవాలయంలో శాకంబరి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఆషాఢ మాసం 3వ మంగళవారం దాతలు సమకూర్చిన దాదాపు 30 క్వింటాళ్ల కూరగాయలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి అంజనీదేవి తెలిపారు.

ప్రతిభ చూపారు.. 'ఆదర్శం'గా నిలిచారు

రాష్ట్రస్థాయి పోటీల్లో చేవెళ్ల మోడల్ స్కూల్, కళాశాలకు ప్రథమ బహుమతి

చేవెళ్ల: సమగ్ర శిక్ష తెలంగాణ ఆధ్వర్యంలో చేపట్టిన అంకురం బిజినెస్ ఇనోవేటర్ ప్రోగ్రాంలో రాష్ట్రస్థాయిలో చేవెళ్ల ఆదర్శ పాఠశాల, కళాశాల విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించారు. నగరంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో వివిధ జిల్లాల నుంచి పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. ఈ మేరకు నిర్వహించిన పోటీల్లో చేవెళ్ల తెలంగాణ ఆదర్శ పాఠశాల, కళాశాల విద్యార్థులు చేపట్టిన భూసార పరీక్ష (సాయిల్ టెస్టింగ్) ఐడియాకు రాష్ట్రస్థాయిలో మొదటి బహుమతి లభించిందని పాఠశాల ప్రిన్సిపాల్ టేనావతి తెలిపారు. రాష్ట్రస్థాయిలో మొత్తం మూడు విభాగాల్లో జరిగిన పోటీల్లో తమ విద్యార్థులు ఒక విభాగంలో విజేతగా నిలిచారని చెప్పారు. రాష్ట్రస్థాయిలో మొదటి బహుమతి రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు.



ప్రథమ బహుమతి అందుకుంటున్న విద్యార్థులు, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

ప్రభుత్వ భూముల్లో షెడ్ల తొలగింపు



ప్రభుత్వ భూమిలో వెలిసిన అక్రమ షెడ్లను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

సాక్షి రంగారెడ్డి జిల్లా: ప్రభుత్వ స్థలాల ఆక్రమణపై ఎట్టకేలకు రెవెన్యూ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. అబ్దుల్లాపూర్‌మెట్ రెవెన్యూ మండల పరిధిలోని పెద్దఅంబర్‌పేటలో విజయవాడ జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న సర్వేనంబర్ 244/34లో కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూములను కొంతమంది ఆక్రమించుకుని అక్రమ నిర్మాణాలు చేపట్టారు. దీనిపై 'ఆక్రమించి.. షెడ్లు వేసి' శీర్షికన సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. తహసీల్దార్ రవీందర్ దత్ పోలీసుల సహకారంతో జేసీబీలతో ప్రభుత్వ భూముల్లోని అక్రమ షెడ్లను తొలగింపజేశారు. ఇప్పటికే రెండు సార్లు అక్రమ నిర్మాణాలను కూల్చివేశామని, అయినా మార్పు రాకుంటే కేసులు నమోదు చేయిస్తామని ప్రభుత్వ భూమిని ఆక్రమించిన ఓ ప్రజాప్రతినిధిని హెచ్చరించారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే కూల్చివేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ నిజాముద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణదారులను వదిలేది లేదు

సాక్షి ఎఫెక్ట్..

యాచారం: దేవాలయాలకు చెందిన భూములను అక్రమంగా ఆక్రమించే వారు ఎంతటివారైనా క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని దేవాదాయ, ధర్మాదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ శేఖర్ హెచ్చరించారు. 'ఆలయానిదే కదా.. ఆక్రమించేద్దాం' శీర్షికన 'సాక్షి'లో మంగళవారం ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. యాచారం గ్రామంలోని తిరుమలేశునికి చెందిన భూమి కబ్జాపై ఆలయ ఇన్‌చార్జి ప్రణీత్‌కుమార్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. 10.21 ఎకరాల ఆలయ భూమిని సర్వే చేయించి ఫెన్సింగ్ వేయించాలని ఆదేశించారు. సర్వే అనంతరం కబ్జా చేసినట్లు తేలితే బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలో ఆలయ భూమిని సందర్శిస్తానని చెప్పారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

డీఆర్‌డీఓ శ్రీలత

తలకొండపల్లి: మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని డీఆర్‌డీఓ శ్రీలత అన్నారు. లక్ష్య సాధన కోసం అధికారులంతా కృషి చేయాలని సూచించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం వన మహోత్సవంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి శ్రీలతతో పాటు, అసిస్టెంట్ డీఆర్‌డీఓ సుభాషిణి, ఏపీడీ సక్రియ, జిల్లా ప్లాంటేషన్ అధికారిణి సంధ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ.. గ్రామాల్లో విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని తెలిపారు. మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమని, ప్రతి పంచాయతీ పరిధిలో 6 వేల మొక్కలను కచ్చితంగా నాటేలా చూడాలని అధికారులకు సూచించారు. హార్టికల్చర్‌లో మల్బరీ తోటలు, బండ్ ప్లాంటేషన్, పామాయిల్, జామ, కమ్యూనికేషన్ ప్లాంటేషన్, మల్టీ లేయర్ ప్లాంటేషన్, ఈత, బ్లాక్ ప్లాంటేషన్ కింద తగిన ప్రదేశాలను గుర్తించి, గుంతలు తీసి మొక్కలు నాటాలని అన్నారు. వచ్చే నెల చివరి నాటికి లక్ష్యాన్ని పూర్తి చేయాలని, లేదంటే సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్లాంటేషన్ సూపర్‌వైజర్ రామచంద్రయ్య, ఎంపీడీఓ శ్రీకాంత్, ఏపీఓ కృష్ణ, కార్యదర్శులు, ఈసీ, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.


భూమిని సర్వే చేసి పరిశీలిస్తున్న తహసీల్దార్, పోలీసు అధికారులు

సద్దుమణిగిన వివాదం

- రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో వక్ఫ్ భూమి సర్వే
- పోలీసుల పర్యవేక్షణలో తాత్కాలిక షెడ్డు ఏర్పాటు

మొయినాబాద్: వక్ఫ్‌బోర్డు భూమిలో ఉన్న పురాతన ప్రార్థనామందిరాన్ని కూల్చివేయడంతో చెలరేగిన వివాదం అధికారులు, పోలీసుల చొరవతో సద్దుమణిగింది. చిలుకూరు రెవెన్యూ సర్వేనంబర్ 133లో వక్ఫ్‌బోర్డుకు సంబంధించి నాలుగు గుంటల భూమి ఉంది. అందులో పురాతన ప్రార్థనాలయం ఉండేది. వక్ఫ్‌బోర్డు భూమి చుట్టూ సర్వే నంబర్ 134లో ఓ ఎన్‌ఆర్‌ఐకి చెందిన పట్టా భూమి ఉంది. దీన్ని చదును చేస్తున్న క్రమంలో ప్రార్థనాలయాన్ని సైతం తొలగించడంతో గొడవ మొదలైన సంగతి తెలిసిందే. మంగళవారం తహసీల్దార్ గౌతమ్‌కుమార్, ఆర్‌ఐ చంద్రమోహన్, సర్వేయర్ రవీందర్‌రెడ్డి, చేవెళ్ల ఏసీపీ కిషన్, మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి, వక్ఫ్‌బోర్డు అధికారుల సమక్షంలో సర్వే నిర్వహించారు. సర్వేనంబర్ 133లో ఉన్న నాలుగు గుంటల వక్ఫ్‌బోర్డు భూమిని గుర్తించి హద్దులు ఏర్పాటు చేశారు. పురాతన ప్రార్థన మందిరాన్ని తొలగించిన చోటే రేకుల షెడ్డుతో తాత్కాలిక మందిరాన్ని నిర్మించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ.. చిలుకూరు రెవెన్యూలోని సర్వేనంబర్ 133లో వక్ఫ్‌బోర్డుకు చెందిన నాలుగు గుంటలు భూమి శ్మశానంగా ఉందని పేర్కొన్నారు. ఎవరైనా వక్ఫ్ భూమిని కబ్జా చేస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ఘటనపై పోలీసులు చర్యలు తీసుకున్నారు. ఎన్‌ఆర్‌ఐకి సంబంధించిన భూమిని చదును చేయిస్తున్న సూపర్‌వైజర్, జేసీబీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. జేసీబీని స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

ట్రాఫిక్ ఏసీపీ నాగభూషణం

కొత్తూరు: మద్యం తాగి వాహనాలు పడిపితే చర్యలు తప్పవని ట్రాఫిక్ ఏసీపీ నాగభూషణం హెచ్చరించారు. మంగళవారం ఆయన కొత్తూరు పట్టణంలోని వై జంక్షన్ కూడలి సమీపంలో ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీని పరిశీలించారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ.. మద్యం మత్తులో వాహనాలు నడిపితే వారితో పాటు ఇతరులు ప్రమాదాలకు గురవుతారని వివరించారు. ముఖ్యంగా పెద్దలు మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లో కూడా వాహనాలు ఇవ్వొద్దన్నారు. వాహనాలకు నంబర్‌ప్లేట్లు కనిపించే విధంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రజలు, వాహనదారులు కూడళ్ల వద్ద రోడ్డు దాటే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎలాంటి సూచికలు లేకుండా అకస్మాత్తుగా వాహనాలను ఇతర రూట్లోకి మళ్లించడం.. రోడ్డు పక్కన నిలపడం ప్రమాదాలకు కారణమన్నారు. కొత్త ట్రాఫిక్ చట్టాలు చాలా కఠినంగా ఉన్నట్లు తెలిపారు. ముఖ్యంగా వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ రవీందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.


వాహన తనిఖీని పరిశీలిస్తున్న ఏసీపీ నాగభూషణం

ఏడాదిగా అవే వెతలు

లోక్‌సభ నియోజకవర్గ కేంద్రంలో రోడ్ల వ్యవస్థ అధ్వానంగా మారింది. ముఖ్యంగా చేవెళ్ల గ్రామ ప్రధాన రోడ్డుకు శంకుస్థాపన చేసి ఏడాది గడుస్తున్నా అడుగు ముందుకు కదలడం లేదు. దీంతో స్థానికులు గుంతల రోడ్డుతో నిత్యం అవస్థలు పడుతున్నారు.

గుంతలమయమైన రోడ్డుతో ఇబ్బందులు

- అలంకారప్రాయంగా శిలఫలకం
- పట్టించుకోని అధికార యంత్రాంగం


గుంతలమయమైన రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

చేవెళ్ల: ప్రభుత్వాలు, పాలకులు మారుతున్న ప్రజా సమస్యలు మాత్రం తీరటం లేదని మండల వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనికి నిదర్శనమే చేవెళ్ల మండల కేంద్రంలో దాదాపు ఏడాది క్రితం రూ.కోటితో గ్రామ రోడ్డుకు నిధులు మంజూరయ్యాయని శిలాఫలకం వేశారు. కానీ నేటికి అంగుళం పని కూడా జరగలేదు. దీంతో రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారి నిత్యం ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులకు గురి చేస్తోంది. రోడ్డును బాగు చేయండి మహాప్రభో అని ప్రజలు మొరపెట్టుకుంటున్నారు.

ప్రధాన రహదారి

మండల కేంద్రంలో బస్‌స్టేషన్ సమీపం నుంచి విలేజ్ వరకు ఉన్న రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. వర్షాలకు ఈ గుంతల్లో నీళ్లు నిలిచి వాహనదారులకు ఇబ్బందులను కలిగిస్తోంది. చేవెళ్ల పట్టణ ప్రజలకు ఈ రోడ్డు ప్రధానమైంది. ప్రతి వారం మండల ప్రజలకు ఉపయోగపడే వారాంతపు సంత ఈ మార్గంలోనే సాగుతుంది. గ్రామానికి సంబంధించిన ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, ఆదర్శ పాఠశాలలు ఈ రోడ్డుపైనే ఉన్నాయి. దాదాపు కిలోమీటరున్నర ఉండే ఈ రోడ్డు అభివృద్ధిని పట్టించుకునే వారే కరువయ్యారు. గత ప్రభుత్వంలోనే రోడ్డుకు ఎంఆర్‌ఆర్ నిధులు కింద కోటి రూపాయలు మంజూరయ్యాయి. అప్పట్లో ఉన్న ప్రజాప్రతినిధులు శంకుస్థాపన సైతం చేశారు. దీంతో రోడ్డు సమస్య తీరుతుందని స్థానికులు ఎంతో సంబురపడ్డారు. కానీ వారి ఆశలు ఆవిరవుతూనే ఉన్నాయి. నిధులు వచ్చాయని చెప్పిన పాలకులు, అధికారులు రోడ్డు పనులను ఇప్పటివరకు ప్రారంభించకపోవడం గమనార్హం.


అప్పట్లో వేసిన శిలాఫలకం

అడుగడుగునా గుంతలే



రోడ్డుపై అడుగడుగనా గుంతలే దర్శనమిస్తాయి. ప్రస్తుతం వర్షాలు పడుతుండటంతో గుంతల్లో నీళ్లు నిలిచి వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతుంది. పిల్లలను పాఠశాలలకు పంపించేందుకు ద్విచక్ర వాహనాలపై వెళ్తుంటే ఈ గుంతల రోడ్డుపై ఎప్పుడు కింద పడిపోతారోనని భయంగా ఉంది.

– అనంత్‌రెడ్డి, బీజేపీ నాయకుడు, చేవెళ్ల

అన్ని విధాలా ప్రయత్నించాను



నేను సర్పంచ్‌గా ఉన్న సమయంలోనే రోడ్డును పూర్తి చేయించేందుకు అన్ని రకాలుగా ప్రయత్నించాను. రోడ్డుపై మిషన్‌భగీరథ లైన్‌లు తీయటం, ఈ నిధులు బీటీ నుంచి సీసీ రోడ్డుకు మార్చటం లాంటి పనులతో కొంత ఆలస్యమైంది. త్వరలోనే విలేజ్ రోడ్డు పనులు ప్రారంభం కానున్నాయి.

– శైలజఆగిరెడ్డి, మాజీ సర్పంచ్, చేవెళ్ల

పనుల ప్రారంభానికి కృషి



రోడ్డుకు సంబంధించిన నిధులు విడుదల విషయంపై ఉన్నతాధికారులతో తెలుసుకుంటాను. నిధులు విడుదలైతే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాను. ఇంజనీరింగ్ అధికారులు, ఇతర జిల్లా అధికారులతో మాట్లాడి రోడ్డు పనుల ప్రారంభానికి కృషి చేస్తా.

– హిమబిందు, ఎంపీడీఓ, చేవెళ్ల

పోక్సో కేసులో 20 ఏళ్ల జైలు

కాచిగూడ: ఓ మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన ఓ డ్రైవర్‌కు పోక్సో కేసులో 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష పడింది. కాచిగూడ సీఐ చంద్రకుమార్, అడ్మిన్ ఎస్‌ఐ కె.సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం .. రత్నానగర్‌లో ఉంటున్న ఎం.వెంకన్న కుమారుడు ప్రవీణ్(28) డ్రైవర్. మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. కాచిగూడ పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసు తీర్పు మంగళవారం వెలువడింది. నాంపల్లి హాకా భవన్‌లోని పోక్సో స్పెషల్ సీజన్ జడ్జి పి.పుష్పలత నిందితుడు ప్రవీణ్‌కు 20ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ఒకవేళ జరిమానా చెల్లించకపోతే నిందితుడు మరో ఆరు నెలలు జైలు శిక్ష అనుభవించాలని, అదేవిధంగా బాధిత బాలికకు రూ.4లక్షలు పరిహారం చెల్లించాలని తీర్పునిచ్చారు. నిందితుడు ప్రవీణ్‌ను జైలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

నాలుగు కిలోల గంజాయి పట్టివేత

శంకర్‌పల్లి: నడుచుకుంటూ వెళ్తున్న ఇద్దరు యువకుల నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్న సంఘటన మంగళవారం మోకిల ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. సీఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. అస్సాం రాష్ట్రానికి చెందిన ప్రంజల్ గోగొయ్(25), అభినష్(24)లు స్థానికంగా ఉంటూ ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తున్నారు. అయితే వీరు పక్క రాష్ట్రాల నుంచి గంజాయి తీసుకొచ్చి మోకిల చుట్టుపక్కల గ్రామాల్లో పనిచేసే కూలీలకు సరఫరా చేస్తుంటారు. ఈ క్రమంలో మంగళవారం గంజాయి సరఫరా చేసేందుకు నడుచుకుంటూ వెళ్తుండగా.. పోలీసులు పక్కా సమాచారంతో వారిని తనిఖీ చేశారు. వారి వద్ద నుంచి నాలుగు కిలోల 200 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు ఇరువురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కి తరలించినట్లు సీఐ తెలిపారు.

వృద్ధురాలి అదృశ్యం

మైలార్‌దేవ్‌పల్లి: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వృద్ధురాలు కనిపించకుండాపోయిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వినాయకనగర్ ప్రాంతానికి చెందిన కొదండ చంద్రమ్మ (65) బయటకు వెళ్లి రాకపోవడంతో మంగళవారం పోలీస్ స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు.

కళాశాల భవనం పూర్తి చేయండి

- పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు సంతోష్
- ఆమనగల్లులో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆమనగల్లు: పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం పూర్తి చేసి విద్యార్థుల ఇబ్బందులు తీర్చాలని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు సంతోష్ డిమాండ్ చేశారు. ఆమనగల్లు పట్టణంలో మంగళవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి కాలేజీ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేసి 24 ఏళ్లు గడిచినా సొంత భవనం లేకపోవడం విచారకరమన్నారు. గతంలో సొంత భవన నిర్మాణం ప్రారంభించినా వివిధ కారణాలతో అసంపూర్తిగా నిలిచిపోయిందన్నారు. ఇప్పటికైనా కాలేజీ భవన నిర్మాణ పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. డిగ్రీ కళాశాలకు కూడా సొంత భవనం నిర్మించాలని ఆయన కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు ఇవ్వాల్సిన రూ.8 వేల కోట్ల ఉపకార వేతనాలను వెంటనే విడుదల చేయాలన్నారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ లలితకు అందించారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు రాహుల్, అర్జున్, నితిన్, పవన్, రాము తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే ప్రాణవాయువు

ఐసీడీఎస్ సీడీపీఓ శాంతిశ్రీ


చిన్నారితో కలిసి మొక్క నాటుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ శాంతిశ్రీ, పక్కన సహస్ర తల్లి శ్వేత

యాచారం: ప్రాణకోటికి ఆక్సిజన్ ప్రధానమని, ప్రాణావాయువు పుష్కలంగా ఉండాలంటే విరివిగా మొక్కలు నాటాలని ఐసీడీఎస్ డివిజన్ సీడీపీఓ శాంతిశ్రీ అన్నారు. అమ్మమాట– అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం కుర్మిద్దలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. పోషకాహారం, ప్రాణవాయువు ప్రాముఖ్యతను వివరించారు.

సహస్రతో కలిసి..

ఎనిమిది నెలల వయసులో గుండెకు రంధ్రం ఉన్నట్లు గుర్తించిన చిన్నారి సహస్రతో కలిసి ఐసీడీఎస్ అధికారులు మొక్క నాటారు. పాపకు ఆపరేషన్ చేయించేందుకు నిమ్స్‌లో చేర్పించగా అప్పట్లో రష్యా– ఉక్రెయిన్ దేశాల మధ్య జరిగిన యుద్ధంతో ఉక్రెయిన్ నుంచి భారత్‌కు ఆక్సిజన్ దిగుమతి నిలిచిపోయింది. దీంతో సహస్రతో పాటు అనేక మంది చిన్నారుల శస్త్రచికిత్సలు ఆగిపోయాయి. కొద్ది రోజుల తర్వాత పరిస్థితులు చక్కబడటంతో ఆక్సిజన్ దిగుమతి జరిగి సహస్ర ఆపరేషన్ విజయవంతమైంది. ఈ నేపథ్యంలో ప్రాణవాయువు ప్రాముఖ్యతను వివరిస్తూ సహస్ర ఇంటికెళ్లి చిన్నారితో మొక్క నాటించారు.

సస్యరక్షణతో పంటకు మేలు

కందుకూరు: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో కూరగాయాల పంటలు సాగు చేసిన రైతులు తక్షణం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను గురించి కృషి విజ్ఞాన్ కేంద్రం క్రిడా నిపుణుడు జి.శ్రీకృష్ణ పలు సలహాలు, సూచనలు అందించారు. వర్షాలతో కూరగాయాల పంటలో తెగుళ్లు ఎక్కువగా ఆశిస్తున్నాయి. ముందుగా మురుగు నీటిని పొలం నుంచి తీసివేయాలి.

- కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు, క్లోరోఫైరీఫాస్ 2 మి.లీ. ఒక్క లీటరు నీటికి కలిపి పంటపై పిచికారీ చేయాలి.
- ఆరుతడి మీద 19-19-19, 13-5-45, యూరియా 5 గ్రాములు, సూక్ష్మపోషకాలు 2 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- నులి పురుగుల తీవ్రతను తగ్గించడానికి సూడోమోనాస్, ట్రైకోడెర్మా, పాపిలోమైసిస్ మిశ్రమాన్ని 5 లీటర్లు, ఒక టన్ను పశువుల ఎరువులో 15–20 రోజులు వృద్ధి చేసి పంట తొలి దశలో నెలలో వేసుకోవాలి. కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఎకరాకు 8 కిలోలు వేసుకోవాలి.


సమాజంలో శాంతియుతంగా మెలగాలి

ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

ఇబ్రహీంపట్నం రూరల్: రౌడీ షీటర్లు సమాజంలో మంచి ప్రవర్తనతో మెలగాలని ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి సూచించారు. మంగళవారం రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు ఆదేశాల మేరకు ఠాణా పరిధిలో ఉన్న రౌడీ షీటర్లను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. రాబోయే బోనాలు పండగ దృష్ట్యా ఎలాంటి ఆందోళన, గొడవల్లో పాల్గొనకుండా శాంతియుతంగా మెలగాలని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరిగిన సహించేది లేదని హెచ్చరించారు. సమాజం, చట్టాల పట్ల గౌరవం కలిగి ఉండాలన్నారు. నేర రహిత సమాజం ఏర్పాటులో ప్రతిఒక్కరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎస్‌ఐ వెంకటేష్, పోలీసులు ఉన్నారు.

తెలంగాణపై పక్షపాత ధోరణి



ఇబ్రహీంపట్నం: కేవలం బీజేపీ ప్రభుత్వాన్ని కాపాడుకునేందుకే బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. తన పదవిని కాపాడుకునేందుకే ప్రధాని మోదీ వారికి మద్దతిస్తున్న బీహార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు అధిక నిధులు కేటాయించారు. తెలంగాణ రాష్ట్రానికి మొండి చెయి చూపించారు. బీజేపీ భాగస్వామ్య పక్షాల రాష్ట్రాలకు నిధులు కేటాయించి తెలంగాణకు తీవ్ర అన్యాయం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పక్షపాత ధోరణితో వ్యవహరించింది. తక్షణమే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పందించాలి. తన మంత్రి పదవికి రాజీనామా చేయాలి.

– మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్యే, ఇబ్రహీంపట్నం

రాష్ట్ర ఉద్యమకారుల సంఘం జిల్లా ఇన్‌చార్జిగా సంజయ్



బషీరాబాద్: తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జిగా సంజయ్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పిడమర్తి రవి మంగళవారం సంజయ్‌కు నియామకపత్రం అందజేశారు. బషీరాబాద్ మండలం రెడ్డిఘణాపూర్ గ్రామానికి చెందిన సంజయ్‌గౌడ్ తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొని పలు పోలీసు కేసుల్లో జైలుకు వెళ్లాడు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఉద్యమ కారులందరికీ 250 గజాల ఇంటి స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చి మరిచి పోయిందని, ఇళ్లస్థలాల సాధన కోసం కార్యచరణ చేపట్టినట్లు సంజయ్ చెప్పారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం స్పందించే వరకు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఉద్యమకారులను ఏకంచేసి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. తనను ఇన్‌చార్జిగా నియమించిన పిడమర్తి రవికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

తలకొండపల్లి: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకి ఆవు మృతి చెందింది. మండలంలోని గట్టుఇప్పలపల్లికి చెందిన గుద్దేటి బాలయ్య జీవనోపాధి కోసం ఆవును కొన్నాడు. మంగళవారం బాలయ్య పొలంలో ఆవు మేసుకుంటూ సమీప ప్రాంతంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకింది. దీంతో విద్యుదాఘాతానికి గురై ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. దాదాపు రూ.1.20 లక్షలు నష్టపోయాయని బాధిత రైతు ఆవేదన చెందుతున్నాడు.

పతకాలను ఈదేశాడు


స్విమ్మింగ్‌లో రాణిస్తున్న 11 ఏళ్ల శ్రీరామ్


పతకాలతో శ్రీరామ్

హుడాకాంప్లెక్స్: రాజస్థాన్‌లో ఇటీవల జరిగిన 7వ జాతీయ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్-2024లో తుక్కుగూడకు చెందిన శ్రీరామ్ కందుల అత్యుత్తమ ప్రతిభను చాటి బంగారు పతకం సాధించాడు. ఉదయ్‌పూర్‌లోని మహారాణా ప్రతాప్ ఖేల్‌గోల్ స్విమ్మింగ్ పూల్‌లో ఈ నెల 19 నుంచి 21 మధ్య ఈ జాతీయ పోటీలు నిర్వహించారు. తెలంగాణ నుంచి శ్రీరామ్ పాల్గొనగా జూనియర్ కేటగిరిలో ప్రతిభ కనబరిచాడు. 11 ఏళ్ల వయసులో అతడు ఏకంగా ఆరు పతకాలను వివిధ పోటీల్లో సొంతం చేసుకున్నాడు. కోచ్‌లు దినేష్, రాజోరియా, సురేంద్రల పర్యవేక్షణలో అతడు శిక్షణ పొందాడు.

నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి

కాంట్రాక్టర్‌పై కేసు నమోదు


కిరాసింధు (ఫైల్)

బంజారాహిల్స్: కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్వాకంతో పొట్ట చేతబట్టుకుని నగరానికి వచ్చిన ఓ కార్మికుడి నిండు జీవితం బలైంది. వివరాల్లోకి వెళితే.. ఒడిశాకు చెందిన కిరాసింధు నియాల్(24) కొంతకాలంగా జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్-36లో ఓ భవన నిర్మాణంలో దినసరి కూలీగా పనిచేస్తున్నాడు. ఎప్పటిలాగే పనులు చేస్తుండగా ఇక్కడ ఉన్న పాత ప్రహరీ గోడ కుప్పకూలి అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. భవన నిర్మాణ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే నియాల్ ప్రాణాలు కోల్పోయాడని ప్రాథమిక ఆధారాలు లభ్యం అయ్యాయి. భవన నిర్మాణంలో నిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తించారు. జీహెచ్‌ఎంసీ సర్కిల్-18 టౌన్‌ప్లానింగ్ అధికారులకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. అయితే జీహెచ్‌ఎంసీ నిర్లక్ష్యంతోనే ఇక్కడ విచ్చలవిడిగా తవ్వకాలు, నిర్మాణాలు జరుపుతున్నట్లుగా ఎన్నోసార్లు స్థానికులు ఫిర్యాదు చేశారు. ఎవరూ పట్టించుకోకపోవడంతో ఓ దినసరి కూలీ ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.